మూషికోదంతము



రాయుడు, దిబ్రుబాల రొక్రానీల విషాదగాథ మొదలు పెట్టేవరకు ఎదురుగా గేటుదగ్గర కారు ఒకటి ఆగింది. డ్రైవరు ఇవతలికి వచ్చి గేటు తీసి, బండి తోలుకుని లోపలికి వస్తున్నాడు.

"లేవండి సార్, లేచి నుంచుని ఈ సిగరెట్టు కాలుస్తూ పోజులో నిలబడండి చెప్తా" అన్నాడు రాయుడు హఠాత్తుగా లేచి నిలబడి. రాజుకి బుర్ర పనిచేసేలోగానే శరీరం రాయుడి ఉత్తర్వును అమలు జరిపింది. అంతలోకీ కారు, పోర్టికోలో ఆగింది. అందులోంచి నల్లటి గుండ్రటి శాల్తీదిగి, గుండారి ఓసారి సరిసరి చేసుకుని "అణ్ణా ఇల్లెయో?" అంది తెల్లగా నవ్వి.

రాయుడు వెంటనే జవాబివ్వలేదు. "ఎవరు సుబ్బన్నగారేనా? లేరు. బెంగుళూరెళ్ళారు" అన్నాడు ఎటోచూస్తూ. రాజేదో అనబోయి రాయుడు గిల్లగానే అగిపోయి, తెల్లబోయాడు. ఆ పైనం చీకట్లో ప్రేక్షకులకు కొట్టొచ్చినట్టు కినబడనందువల్ల, రాయుడు పచ్చి అబద్ధాలు ఆడుతున్నట్టు పసిగట్టడానికి వీలులేక పోయింది.

ఆ వచ్చిన పెద్దమనిషి నొచ్చుకున్నాడు. "ఆ....చ్చొ....చ్చొ.... చుప్పణా ఉంట్రని దానే వస్తిణీ. నేటికి షో ఉణ్ణని నేనా చెప్పి ఉంట్నె. పద్దుకొండు గంటకు బండి తెస్తునని కూడా చెప్తినే. యేమి ఇది. నిండా అక్రమంగా ఉందే" అన్నాడు జనాంతికంగారుగా.

రాయుడు గొంతు సరిచేసుకున్నాడు.

"అదేనండి. చెప్పారు. అర్జెంటు పనిగా బెంగ్లూరు...." అన్నాడు. తరవాత 'మీరు రాజన్‌గారు' అని ఆరోపించాడు. ఆయన ఫస్టు పిక్చరు పెద్ద హిట్టయిందని ఉద్ఘాటించాడు. దారుణమైన హిట్టు అని పునరుద్ఘాటించాడు. ఇపుడు కాష్ట్యూము పిక్చరు తీశారు అని వెల్లడించాడు. ఇది గారంటీ హిట్టవుతుందని హామీ ఇచ్చాడు. భయపడద్దని ఉద్ఘోషించాడు. ఆ తరవాత వీరు రాజుగారు. ప్రొడ్యూసరు. పైపెచ్చు సుబ్బన్నగారికి అల్లుళ్ళు" అని పరిచయం చేశాడు రాజుని.

"రొంబ సందోషం. అది సరిధా....అవ్పొ తాంగళ్ యార్." అన్నాడు రాజన్‌గారు ఆనందవర్ధనుడై.

రాయుడు సిగ్గుపడ్డాడు. "యేవిటో మన్నిగురించి మనం చెప్పుకో కూడదుగాని మనం కారెక్టరాక్టర్లం, విలన్లం లెండి. రెండు మూడు హిట్ పిక్చర్లలో చిన్నవేషాలు కూడా వేశాం" అన్నాడు.

* * * *

మళ్ళీ పాతసమస్య వచ్చింది, రాజన్‌కి. సుబ్బన్నగారు లేరుగాబట్టి ఏంచెయ్యాలి అని.

వారి అల్లుడిగారిది చాలా మంచి చెయ్యి అని వెల్లడి చేశాడు రాయుడు. రాజు తక్షణం సిగరెట్టు పారేసి చేతులు వెనక దాచుకున్నాడు. రాయుడు బలవంతాన వాటిని ముందరికి లాగి రాజన్ చేతులో పెట్టాడు. అనక, రాజు హస్తవాసిపడి హిట్టయి ఊరుకున్న హిందీ, మలయాళ, తమిళ పిక్చర్ల జాబితా ఒప్పగించాడు.

రాజన్ పరమానంద భరితుడైపోయి, రాజుని కాగలించుకొని, "మీరు వచ్చిదా కావలెసార్. పిక్చరు చూసిదా కావలె. మాకు మీబ్లెస్సింగ్సు ఇచ్చిదా కావలె" అని అతన్ని లాక్కుపోయి కార్లో కూచోపెట్టి తను ఎక్కాడు. అనక ఏదో తోచి, "సార్ మీరుకూడ వస్తురా" అంటూ వరండాలోకి చూసి అన్నాడు.

"నేను వచ్చిదా కావలె. రాజు ఎక్కడ పోతే అక్కడ ఉండిదా కావలె" అన్నాడు రాయుడు కారుసీటు అవతల మూలలోంచి.

రాజన్, ఈ చురుకుదనం చూసి ఆశ్యర్యపడి లేవడం మరచిపోయి కునికిపాట్లు పడసాగాడు.

రాజుకి నోటమాట రాలేదు.

కారు నేరుగా .... స్టుడియోలో, ప్రివ్యూ థియేటర్ దగ్గిర ఆగింది. ఆరుబయట కుర్చీలు వేసి ఉన్నాయి. ఇద్దరు కుర్రాళ్ళు బీడి కాలుస్తున్నారు. రాజన్ కారు దిగుతూనే రాజానీ, రాయుణ్ణీ కూర్చోమని, కుర్రాళ్ళని ఎటో పంపి, తను మరోవైపు వెళ్ళాడు హడావుడిగా.

"ఏవిటిదంతా బ్రదర్" అన్నాడు రాజు దగ్గర్లో ఎవరూ లేకుండా చూసి.

"మీకు తెలీదాండి. ఇంకా తెలీలేదా?" అన్నాడు రాయుడు ఆశ్చర్యంగా.

"వెధవేషాలెయ్యక చెప్పు" అన్నాడు రాజు ముక్తసరిగా.

రాయుడు జాలిపడ్డాడు.

"మీరు లాభంలేదు సార్ సినీఫీల్డుకి .... ఇవన్నీ తెలీపోతే రేపొద్దున పెద్ద ప్రొడ్యూసరెలా అవుతారు ? .... ఇపుడు మన్ని తీసుకొచ్చాడే రాజన్‌గారూ. ఈయన టమిల్ ప్రొడ్యూసరన్నమాట. ఈయన మొదటి పిచ్చరు తీసినపుడు ఓ తమాషా అయింది. అవాళా ఇలాగే మే 13 తారీకు రాత్రి పన్నెండింటికి రాహుకాలం లేదని ఈయన షో వేసుకుంటున్నాడు. ఇక్కడ అలా వేస్తారులే. డిస్ట్రిబ్యూటరూ, స్టార్లూ వాళ్ళవాళ్ళూ చూడడానికని. ఏం. అవాళ మీమామగారు సుబ్బన్నగారు ఇక్కడే తిరుగుతున్నారు, ఎవరన్నా కారులో లిఫ్టిచ్చి మాంబళంలో దిగబెడతారేమోనని, ఆయనకారు చెడిపోయింది. సరే ఇంతలోకి రాజన్ ఆయన్ని పలకరించాడు. ఓ నాలుగు గంటలాగితే తను దిగబెడతానన్నాడు. అప్పటికి వీళ్ళకి కొంచెం పరిచయం ఉంది. సరే, సరేనన్నాడు మీ మావగారు. అయితే వచ్చి మాఫిలిం చూడండి అని పిలిచాడు రాజన్. ఫిలిం మొదలెడుతుండగా ఎలకోటి తెర దగ్గర్నుంచి పరిగెట్టి వెళ్ళింది. అప్పుడు మీ మావగారు ఎగ్గిరి గంతేసి, 'మీ పిచ్చరు హిట్టవుతుంది రాజన్‌గారూ. ఈ స్టుడియో ఎలక చాల లక్కీ ఎలకా, షో వేసినపుడుగాని, రికార్డింగు టైములోగాని ఇది కనిపిస్తే ఆ పిచ్చరు హిట్టేనూ' అని చెప్పాడు. రాజన్‌కీ ఆ సంగతి కొద్దిగా తెలుసు.

ఆయన పొంగిపోయాడు ఆనందంతో. 'నిజమేనండీ జుప్పణ్ణాగారూ! మా పిచ్చరు ఫస్టుసాంగు రికార్డింగు టైములోకూడా ఈ ఎలిదా వచ్చిందీ' అని చెప్పాడు.

అప్పుడు సుబ్బన్నగారు నవ్వి, "ఈ ఎలక రావాలని ఎందరో తపస్సు చేస్తారండీ రాజనుగారూ.—టేకు పాడైనా సరే ఇది ఒక్కసారి కనిపిస్తే లక్షలు కుమ్మరిస్తారండీ బాబూ. మీరు గొప్ప అదృష్టవంతులు బాబోయ్! కాబట్టే వచ్చిందండీ అన్నాడు. అంతలోకీ—"

* * * *

అంతలోకీ ఒక రాజకుమారుడు అలా వెళ్తున్నాడు. ఎవరో ఎక్కడినించో ఓ మంగళహారతి పళ్ళెం పట్టుకు వచ్చారు. అతడు హారతి కళ్ళ కద్దుకుని, మూడు గుంజీలు తీసి ప్రసాదం పుచ్చుకుని, కారెక్కి వెళ్ళిపోయాడు.

అదేమిటన్నాడు గుడ్లప్పగించి చూస్తున్న రాజు.

"వాళ్ళో పిచ్చరు తీస్తున్నారులే. ఇవాళ క్లయిమాక్సుసీను తీశారు. అందులో దేవుణ్ణి కోప్పడ్డం అదీ ఉంటుంది. ఎందుకేనా మంచిదని షూటింగు ముందరా, అయిపోయాకా రెండు పూజలుచేసి హారతిపుచ్చుకు మరీ తిడతారులే.... నీకు తెలీదా? తరవాత ఈ ఫిలిం డబ్బాల సెట్టు ఒకటి తిరపతి వెళ్తుంది. అక్కడ స్పెషలు పూజా, హారతీ అయ్యాకనే పిచ్చరు రిలీజు చేస్తారు. దేవుడితో గొడవ గదా. వీళ్ళు తిట్టినట్టు దేవుడు లేకపోతే ఫరవాలేదు గాని, ఉంటే పగబట్టి పిచ్చరు హిట్టవకుండా చెయ్యొచ్చు గదా. అంచేత" అన్నాడు రాముడు గంభీరంగా.

"హౌరా" అన్నాడు రాజు.

"హౌరాలేదు కలకత్తాలేదు. వినండిసార్. ఏం చివరికి రాజన్ సంగతి ఏమైందో తెలుసా, ఆ పిచ్చరు సిల్వర్ జూబిలీలు చేసుకుంది. అప్పట్నించి రాజన్‌కి ఆస్టుడియో ఎలకిన్నా, మీ మావగారన్నా మహాగురి. ఆ పిచ్చరుకి మే 13 న అర్ధరాత్రి షో యిచ్చారుగదా. అది హిట్టయింది. అందుకని ఈ పిచ్చరుకీ మే 13 నే అర్ధరాత్రే ఇస్తున్నారు. అవాళ సుబ్బన్నగారు ఆ పిచ్చరుచూసి రాజన్ కారులో పానగల్‌పార్కు దాకా వెళ్ళారు. ఇవాళా అలా చేద్దామనే ఇతను ఇందాకా వచ్చాడు. మీరు ఆయన అల్లుడని, మీ హాండుకూడా లక్కీదని చెప్పబట్టి మన్ని పిల్చాడన్నమాట."

"మరి ఎలకో"

"ఎలక వస్తుంది. మీ మావగారు లేకపోతే, ఎలకా రాపోతే

ఇవాళ షో అసలు వెయ్యరంతే .... చూళ్లే ఇప్పుడు రాజన్ గబగబా పరిగెత్తాడు. ఎందుకని?" అన్నాడు రాయుడు.

'ఏమో.'

'ఎబ్బే లాభంలేదు. ఉల్లిపాయ పకోడీలు చల్లితే ఎలక ఎక్కడున్నా వస్తుందని ఆయనకి ఆశ. అందుకని పకోడీలు తెప్పించడానికి పరిగెత్తాడు. ఈమాత్రం తెలీదా?" అన్నాడు రాయుడు హేళనగా.

'తెలీదు' అన్నాడు రాజు.

"అయితే మీరు లాభంలేదు."

రాజు ఆబళిళ్చి, "శ్భద్దడొస్తోల్ది" అన్నాడు.

రాయుడు నవ్వాడు లాలనగా. "హాయ్ .... అమ్మయ్య .... అలా ఆబళిళ్చ గడ్డి .... హాయ్ .... చూస్తే హేవేళా అకుకుంటాడు రాజ్‌న్ గారు" అన్నాడు.

కానీ రాజన్‌గారు ఆక్షణాన వీళ్ళని చూడకుండానే వీళ్ళగురించి చాలా అనుకుంటున్నాడు. సాధ్యమైనంత త్వరలో చూడాలని ఉవ్విళ్ళూరుతున్నాడు. 'మట్టప్పసింగో' అంటున్నాడు పళ్ళు గిట్టగరచుకు కోపం అదుపు చేసుకుంటూ. చూశాక ఏం చేస్తాడో ఆయన కల్లా యివ్వటంలేదు గాని, ఆయనవెంట దూకుడుగా అంగలేస్తూ వస్తున్న సుబ్బన్నగారు మటుకు భారీఎత్తున కార్యక్రమాలను ప్రకటిస్తున్నాడు.

రాజునీ రాయుణ్ణీ జాయింటుగా తాళ్ళతో కట్టేసి, హైపవర్ దీపాల కింద పడుకోబెట్టి స్విచ్చి నొక్కడం, రెండు మూడు గజాల తమిళ డైలాగును వాళ్ళ చెవి దగ్గర చదివింపించడం తరవాత చావగొట్టి చెవులు మూసి మూర్ఛపోకుండా చూడడం ఆయన తాత్కాలిక కార్యక్రమావళిలో తొలి అంశాలు. ఇవికాస్త అటూ యిటూ మారినా ఇద్దరు వెధవాయిలకీ

చెరి అరడజను బెంబుల స్టుడియో కాపీ పట్టించెయ్యాలి అన్న శిక్షలో మాత్రం అరకప్పు కూడా తగ్గించనని ఆయన శపథం పట్టాడు.

దొంగవెధవలు అన్నాడు. ఓ క్షణం ఆగకుండానే దగాకోరులు అన్నాడు. నన్ను మోసం చెయ్యడం గాక నాపేరుతో మిమ్మల్నీ మోసం చేస్తారా రాజన్ సార్! అన్నాడు.

రాజన్ ఒగురుస్తున్నాడు ఉద్రేకంతో. "ఆమా సార్ .... వాడి మూతి బాగనే లేదు. నాకు మొదుట్నే పట్టలేదు ఏమ్రా వీడి మూతి దొంగపిల్లకాయ మాదిరిగా ఉండాది. చుప్పణ్ణాఖాయా వీళ్లే లేదంటా దేమ్రా. నంబ కిట్టక తెపుడుస్తున్నాడా అని నిండా యోచన సేస్తిని .... య్యేమొ ఒక సమయం అట్టదా ఉండవచ్చు. అట్లని ఎంచిదా ఈ తొంగక్కిల్లాడి పిల్లకాయల్ని బండిలోపెట్టి తోలుకు వస్తే, కర్మ ఆద కడవుళే. ఆద్దోపారు .... కూచుకుని ఉండారు. కాగ్రంగు పస్సంగో .... చుప్పణ్ణాసార్. మీరు పోతూనే ఒద ఒద అని కొట్టి ఊడ్పండి. తిర్రిటి ర్రాస్కెల్. అయ్యోగ్యప్పయెలే." అంటూ ఉత్సాహంగా అడుగేసి, 50 అడుగుల దూరాన ఉన్న రాజునీ, రాయుణ్ణీ చూపించాడు.

* * * *

చదువరీ! రాయుణ్ణీ రాజునీ గెంటేసి తలుపేసుకున్న సుబ్బన్నకి ఆ రోజు రాత్రి....స్టుడియోలో రాజన్ తమిళ చిత్రం షో వుందని తెలుసు. ఎటొచ్చీ, వచ్చి వెళ్ళాడని మటుకు తెలీదు. సుబ్బన్న ఓ గంట సేపు చూసి, కారు తీసుకుని తనే బయల్దేరాడు రాజన్ ఏ కారణం వల్ల రాలేదో అనుకుని. తీరా స్టుడియో కెళ్ళే సరికి ఉల్లిపాయ పకోడీలు పురమాయించ డానికి గేటుదాకా వెళ్ళిన రాజన్ కనబడ్డాడు. ఇద్దరూ యథాశక్తి తెల్లబోయి మళ్ళీ యథాప్రకారం నల్లబడ్డాక, "మీరు బెంగ్లూరు బోతిరని, మీ అల్లుడిని తోలకొస్తిని. నిండా మంచివేళ మీరే వస్తిరి." అన్నాడు రాజన్ సంతోషంగా.

సుబ్బన్న భగ్గుమన్నాడు. వేడి ఆరాక, తనకు తోచిన కొద్ది మాటలలో రాజూ రాయడూ తనకు టోకరాయిచ్చిన రాక్షసులని వెల్లడించాడు. అపుడు ఆ యిద్దర్నీ తన్నడానికని ఈ యిద్దరూ దూకుడుగా ప్రీవ్యూ థియేటరుకు బయల్దేరి వచ్చారని చదువరికీ పాఠార్ధికీ తెలుసుగాని, కుర్చీలో కూర్చున్న రాజూ, రాయుడూ కల్లోగూడా అనుకోలేదు; కునికి పాట్లు పడుతున్నప్పటికిన్నీ. అందువల్ల సుబ్బన్న రాజన్‌ల కార్యక్రమం జయప్రదంగా నెరవేరింది.

*　　　*　　　*　　　*

రాత్రి రెండయింది.

కోడంబాకం హైరోడ్డుమీద ఇద్దరు పాంథులు మెల్లిగా నడుచు కుంటు కుంటూ ఒకళ్ళనొకళ్ళు ఓదార్చుకుంటూ వెళ్తున్నారు, ఈలపాట వినబడటం లేదు. కాబట్టి వారు షికారెళ్తున్నారని పొరబడలేము. దగ్గర కెళ్ళి, సెర్చిలైటు, లేపోతే టార్చిలైటు వెలిగించితే, వాళ్ళిద్దరిలో ఒకడు వరహాలరాజు అనీ, రెండోవాడు రాయుడు అనీ సూక్ష్మబుద్ధులు చప్పునే పసిగట్టగలరు.

రాజు దవడలు రెండూ పొంగి వుండడం, రాయుడు మొహం ఉబ్బి ఉండడం చూసి వాళ్ళిద్దరూ గ్లాక్సో బేబీలకి ఎన్‌లార్జ్‌డ్ ఎడిషన్స్ అనుకోదలచుకున్నా, ఆ ఊహ కొద్దీ వీళ్లు దేశవాళీ సినిమాలో హీరో వేషాలకి తంగున సరిపోతారనుకో దలచుకొన్నా, కమిలిపోయిన రాజు కుడికన్ను నలుపుచూసి అది బ్యూటీస్పాట్ అని దురభిప్రాయ పడదలచు కొన్నా సదరు వ్యక్తులు అలా అనుకోడానికి ముందు చట్టపరిగేలా పొరపడి అందుకు ముందు తప్పులో కాలువేయాలి.

*　　　*　　　*　　　*

'కాళ్లు పీకుతున్నాయి' అన్నాడు రాజు.

"హు. నాకు జీవితమే పీకుతోంది' అన్నాడు రాయుడు నీరసంగా.

రాజు మాటాడలేదు.

రిక్షా ఎక్కుదామని ఊహపోయింది రాయుడికి.

డబ్బుల్లేవని జ్ఞాపకం వచ్చింది రాజుకి.

రిక్షాని తిన్నగా సుబ్బన్నగారింటికి పట్టించి — ఆయన ఇపుడు స్టుడియోలో ఉన్నాడు కాబట్టి — లక్షిన్నరసుని డబ్బులడగవచ్చన్న ఉపాయం తట్టింది రాయుడికి.

కాని ఆవేళకి సుబ్బన్న తిరిగివచ్చివుంటే, 'మళ్ళీ ఇక్కడికి తయారయ్యారా' అని మళ్ళీ చితగ్గొట్ట వచ్చునని అనుమానం కలిగింది రాజుకి.

లక్ష్మీన్నరసు అడ్డుపడదా, ధర్మపత్నిగదా? అని ఆలపద్దాడు. రాయుడు.

ఏమో ఎలాగేనా 'ఫీమేల్సు' గదా అని నిరాశ పడ్డాడు రాజు.

రాయుడు మాట్లాడలేదు.

*   *   *   *

'కాళ్ళు పీకుతున్నాయి' అన్నాడు రాజు.

'జీవితమే పీకుతోంది' అన్నాడు రాయుడు.

రాజుకి కోపం వచ్చింది.

'ఇందాకోసారి చెప్పావు. ఇంకా ఎన్నిసార్లు వెధవ డైలాగూ వెధవ నువ్వూను' అన్నాడు.

రాయుడు బాధగా నవ్వాడు.

'హు.—మహా హీరో ఛాన్సిచ్చిన ప్రొడ్యూసర్లా మాట్లాడావే నా డైలాగు గురించి! నేను గట్టిగా ఓటిచెప్తే గుమ్మైపోతావు మళ్ళీ....విను....

కార్లో కావాలని మన్ని తీసుకొచ్చి క్రైమాకింద కొట్టి కేవలం వెధవలుగాకట్టి కనికరం లేకుండా కాళ్ళు పీకుతున్నా, కాలం ఎంతయిందో గమనించకుండా, కడుపులో కరకర మంటున్నా కాఫీయేనా లేకుండా, కాలదన్ని—"

"ఆపెయ్....కట్....స్టాప్....హోల్డాన్....క్లోజ్ ప్లీజ్" అన్నాడు రాజు కఠినంగా.

"నాకేం ఓపిక లేదండి. మీరు తిట్టారనే...."

"ఆమాత్రం తిట్టకూడదా. నీకు యజమాన్నిగదా. కోప్పడ్డానన్న కసికొద్దీ అలా కకారపు కర్కశపు, కర్కాటకపు డైలాగులతో నన్ను ఖడలకొడతావా క్రూరుడా నీకు కృతజ్ఞత లేదా?" అన్నాడు రాజు కోపంగా.

రాయుడు దిగులుగా నవ్వాడు. ఉన్న ఒక్క బీడీముక్కా పారేసుకుని హా విధిలీల! అనుకున్న బైరాగిలా!

"అనండిసార్. అనండి. ఆఖరికి మీరుగూడా కృతజ్ఞత లేదండి. హు. ఆ నరసూ, దాని బాబాయీ మీకు డబ్బులేదని పుకార్రాగానే వదిలేశారు. మీ చెయ్యి మంచిదని షో చూపటానికి కార్లో తీసికెళ్ళిన రాజన్, మీరు వెధవలు అని తెలియగానే ఈ అర్ధరాత్రిపూట మిమ్మల్ని వెళ్ళగొట్టి కోడంబాక్కం రోడ్డు పొడుగు కొలవమన్నాడు. వాళ్ళని మీరు తిట్టలేదు. పైపెచ్చు నన్నంటున్నారు. విశ్వాసం లేదని. ఇలాగే ఉంటుంది లోకం. అన్నట్టు ఇందాక రోక్రానీ కథ చెబుతూ ఉండగానే కదూ ఈ రాజన్‌గాడొచ్చి గొడవ పెడత? వినండి చెబుతా.